ప్రజల ఆరోగ్యంతో చెలగాటం



రావులచెర్వులో కోళ్ల వ్యర్థాలతో సాగు చేస్తున్న చేపల చెరువు

- కోళ్ల వ్యర్థాలతో చేపల పెంపకం
- పర్యావరణానికి వాటిల్లుతున్న ముప్పు
- ఉమ్మడి ఇటిక్యాలలో వందల ఎకరాల్లో చేపల సాగు

ఎర్రవల్లి: తక్కువ ఖర్చుతో ఎక్కువ లాభాలు పొందాలనే దురుద్దేశంతో కొందరు అక్రమార్కులు చేపల చెరువులు సాగుచేసి ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడుతున్నారు. కుళ్లిన కోడిగుడ్లు, కోడి పేగులు, ఈకలు, కుళ్లిన మాంసం, చనిపోయిన ఇతర జంతువులను సైతం చేపలకు ఆహారంగా వేస్తున్నారు. ప్రజల ఆరోగ్యంతో పాటు పర్యావరణానికి ముప్పు కల్గిస్తున్నారని మండల ప్రజలు వాపోతున్నారు.

వందల ఎకరాల్లో సాగు

ఉమ్మడి ఇటిక్యాల మండలంలోని తిమ్మాపురం, సాసనూలు, కొండేరు, జింకలపల్లి, మొగిళి రావుల చెర్వు తదితర గ్రామాల్లో ప్రభుత్వ అనుమతి లేకుండా విచ్చలవిడిగా వందల ఎకరాల్లో చేపల సాగు చేస్తున్నారు. చేపలకు మేతగా వేరుశనగచెత్త, తవుడు, సోయాబీన్ మిలెడ్‌లను వాడాల్సి ఉంటుంది. వాటిని వేయడం వల్ల నెలకు ఎకరాకు రూ.25 వేల నుంచి రూ.30 వేల వరకు ఖర్చు కావడంతో పాటు చేపల శరీర ఎదుగుదల కూడా సాధారణంగా వస్తుంది. ఈ ఖర్చును తగ్గించుకోవడంతో పాటు చేపల బరువును త్వరగా పెంచేందుకు కుళ్లిన కోడిగుడ్లు, కోళ్ల వ్యర్థాలను మేతగా వేస్తున్నారు.

యథేచ్ఛగా వ్యర్థాల తరలింపు

పట్టపగలే ఆటోలు, వ్యాన్లలో కోళ్ల వ్యర్థాలను కర్నూలు, గద్వాల, వనపర్తి, కొల్లాపూర్, జడ్చర్ల, మహబూబ్‌నగర్, హైదరాబాద్ తదితర ప్రాంతాల నుంచి విచ్చలవిడిగా చెరువులకు తరలిస్తున్నారు.

ఇబ్బంది పడుతున్న రైతులు

స్థానిక గ్రామాల ప్రజలతో పాటు చేపల చెరువులకు చుట్టు పక్కల వ్యవసాయ పొలాల రైతులు కంపును భరించలేక అవస్థలు పడుతున్నట్లు వాపోతున్నారు. చెరువులకు రెండు మూడు కిలోమీటర్ల పరిధిలో కూడా కంపు కొడుతుండటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ప్రభుత్వ నిబంధనలకు పాతర

కోళ్ల వ్యర్థాలను చేపలకు మేతగా వేయడాన్ని నిషేధిస్తూ 2016లో ప్రభుత్వం జీఓ నంబర్ 56ను జారీ చేసింది. ఈ జీఓను అమలు చేసేందుకు మండల స్థాయిలో తహసీల్దార్, మత్స్య అభివృద్ధి అధికారి (ఎఫ్‌డీఓ), ఎస్‌ఐ, వెహికిల్ ఇన్‌స్పెక్టర్లతో పాటు టాస్క్‌ఫోర్స్ కమిటీని ఏర్పాటు చేశారు. పట్టుబడ్డ వ్యర్థాలను నాశనం చేయడంతో పాటు డ్రైవర్ లైసెన్స్ రద్దు చేసి వ్యర్థాలతో సాగు చేస్తున్న చేపల చెరువుల రిజిస్ట్రేషన్ రద్దు వంటి చర్యలను టాస్క్‌ఫోర్స్ సిబ్బంది అమలు చేయాల్సి ఉంది.

కన్నెత్తి చూడని అధికారులు

ఉమ్మడి ఇటిక్యాల మండలంలోని వందల ఎకరాలలో అక్రమంగా చేపల చెరువులను సాగు చేస్తున్నారు. ఎటువంటి నిబంధనలు లేకుండా సంబంధిత శాఖల అధికారులు అనుమతులు మంజూరు చేయడంలో విచ్చలవిడిగా చేపల సాగును చేస్తున్నారు. చేపల సాగుపై ఎన్ని ఫిర్యాదులు అందినా సంబంధిత శాఖల అధికారులు కనీసం చెరువుల వైపు కన్నెత్తి కూడా చూడటం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.



రావులచెర్వు వద్ద కుళ్లిన కోడిగుడ్లు, మాంసాన్ని ఉడికిస్తున్న చెరువు యజమాని

కూలీలు రావడం లేదు



మా పొలానికి సమీపంలో చేపల చెరువులను సాగుచేస్తున్నారు. చేపలకు కుళ్లిన చికెన్ వ్యర్థాలను, కుళ్లిన కోడిగుడ్లను ఉడికించి ఆహారంగా వేస్తున్నారు. దీని వల్ల దుర్వాసన అధికంగా వస్తుండటంతో అనారోగ్యాలకు గురవుతున్నాం. వాసన వల్ల కూలీలు సైతం పనులకు రావడంలేదు. అధికారులకు పలుమార్లు విన్నవించుకున్నా పట్టించుకోవడం లేదు.

– వెంకట్రాముడు, రైతు, జింకలపల్లి

చర్యలు తప్పవు



చేపలకు ఆహారంగా కోళ్ల వ్యర్థాలు, కుళ్లిన కోడిగుడ్లు వేయడం చట్టరీత్యా నేరం. ప్రభుత్వం నిషేధించిన వ్యర్థాలతో చేపలను సాగు చేసి ప్రజల ఆరోగ్యాలతో చెలగాటమాడితే కఠిన చర్యలు తప్పవు. మండలంలో ఎక్కడైనా చెరువులలో కోళ్ల వ్యర్థాలను వేసి చేపలను పెంచుతున్నట్లు మాకు సమాచారం అందితే వెంటనే చెరువులపై దాడి చేసి వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటాం.

– నరేష్, తహసీల్దార్, ఎర్రవల్లి

కేసులు నమోదు చేస్తాం



వాహనాల ద్వారా చేపల చెరువులకు కోళ్ల వ్యర్థాలను, కుళ్లిన కోడిగుడ్లను తరలించడం చట్టరీత్యా నేరం. ఎక్కడైనా కోళ్ల వ్యర్థాలను తరలిస్తూ వాహనాలు పట్టుబడితే వాటిని అదుపులోకి తీసుకొని కేసులు నమోదు చేస్తాం. పలుమార్లు చికెన్ వ్యర్థాలను తరలిస్తూ పట్టుబడిన వాహనాలను అదుపులోకి తీసుకొని వాటిని పీఎస్‌లకు తరలించాం. అనంతరం మత్స్యశాఖ అధికారులకు సమాచారం అందించాం.

– రవిబాబు, సీఐ, అలంపూర్

ఆస్పత్రి అందుబాటులోకి తేవాలి



మెడికల్ అధికారితో మాట్లాడుతున్న పల్లయ్య

అయిజ: మండల కేంద్రంలోని పీహెచ్‌సీ వద్ద నిర్మిస్తున్న 30 పడకల ఆస్పత్రి భవన నిర్మాణ పనులు నిలిచిపోయాయని, పనులు పూర్తిచేసి ఆస్పత్రిని అందుబాటులోకి తేవాలని బీఆర్‌ఎస్వీ జిల్లా కోఆర్డినేటర్ పల్లయ్య కోరారు. గురువారం పీహెచ్‌సీలో మెడికల్ అధికారి కిరణ్‌కుమార్‌ను కలిసి సమస్య విన్నవించారు. ఆస్పత్రి అందుబాటులో లేక ప్రజలు అవస్థలు పడుతున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్వీ నాయకులు తులసిగౌడ్, రాజు, సూర్య, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

కేసుల పరిష్కారంలో జాప్యం వద్దు



ఉండవెల్లి: మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌ను డీఎస్పీ మొగలయ్య గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా పలు రికార్డులు తనిఖీ చేశారు. కేసుల పరిష్కారంలో జాప్యం ఉండకూడదని సూచించారు. గ్రామాల్లో సైబర్ క్రైంపై ప్రజలకు అవగాహన కల్పించాలని ఎస్‌ఐ శేఖర్‌కు సూచించారు. కార్యక్రమంలో స్టేషన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వం రైతుల కష్టాలను గుర్తించాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

అలంపూర్: ప్రభుత్వం రైతుల కష్టాలను గుర్తించాలని బీఆర్‌ఎస్ నాయకుడు మహేష్ కోరారు. పట్టణంలోని కార్యాలయాల్లో తహసీల్దార్ మంజుల, వ్యవసాయ శాఖ మండల అధికారి నాగార్జునరెడ్డికి గురువారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మహేష్ మాట్లాడుతూ.. రైతులకు సకాలంలో ఎరువులు అందక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు తెలిపారు. యూరియా కోసం రైతులు కార్యాలయాల వద్ద రోజుల తబడి నిరీక్షించాల్సిన దుస్థితి నెలకొందన్నారు. కౌలు రైతుల పరిస్థితి మరింత దయనీయంగా ఉందన్నారు. పాస్ పుస్తకాలు అందక యూరియా తెచ్చుకోవడానికి కష్టాలు పడుతున్నట్లు తెలిపారు. వర్షాల వల్ల పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాసులు, రైతులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలి

ఇటిక్యాల: ఉపాధ్యాయులు సమయపాలన పాటించి విద్యార్థులకు అర్థమయ్యేలా బోధన ఉండాలని ఎంఈఓ వెంకటేశ్వర్లు అన్నారు. గురువారం మండల పరిధిలోని మొగిళిరావులచెర్వు గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలను ఆయన సందర్శించారు. పాఠశాలల పరిసరాలు, వంటగది, తరగతి గదుల నిర్వహణ తీరును పరిశీలించారు. ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరుశాతం, రికార్డులు తనిఖీ చేశారు. విద్యార్థుల అభ్యసన సామర్థ్యాన్ని పరిశీలించేందుకు చతుర్విధ ప్రక్రియలు చేయించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

పిల్లల భవిష్యత్‌ను పాడు చేయవద్దు



పొలం వద్ద విద్యార్థులతో ఉపాధ్యాయులు

గట్టు: బడిఈడు పిల్లల బంగారు భవిష్యత్‌ను పాడు చేయవద్దని డీసీపీఓ నర్సింహ అన్నారు. గురువారం కాంప్లెక్స్ హెచ్ఎం నల్లారెడ్డి, హెచ్ఎం అశ్విని, నర్సింహులుగౌడ్‌తో కలసి రాయాపురం శివారు పొలంలో పనులు చేస్తున్న చిన్నారులను గుర్తించారు. అనంతరం వారి తల్లితండ్రులకు అవగాహన కల్పించారు. డీసీపీఓ మాట్లాడుతూ.. చదువుకోవాల్సిన పిల్లలను బడి మాన్పించి పొలాల్లో పనులు చేయించడం చట్టరీత్యా నేరమన్నారు. బడి ఈడు పిల్లలతో పనులు చేయిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం గ్రామంలో పర్యటించారు. పలువురు చిన్నారులను పాఠశాలలో చేర్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రాజుసాగర్, సీఆర్‌పీ శ్రీధర్, కానిస్టేబుల్ కోటి తదితరులు పాల్గొన్నారు.

రేపు అనంతపద్మనాభస్వామి వ్రతం

మల్దకల్: ఆదిశిలా క్షేత్రమైన స్వయంభూ లక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయంలో అనంత పద్మనాభ స్వామి వ్రతం నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ సత్యచ్ఛంద్రారెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం ఉదయం 10 గంటలకు స్వామి వారికి ప్రత్యేక అలంకరణ, మహామంగళ హారతితో పాటు వ్రతం చేయనున్నట్లు పేర్కొన్నారు.

స్థానిక ఎన్నికల్లో సత్తా చాటుతాం

ఆత్మకూర్: రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటుతామని మాజీ ఎంపీపీలు బంగారు శ్రీనివాసులు, వీరేశలింగం, విండో అధ్యక్షుడు లక్ష్మీకాంత్ రెడ్డి అన్నారు. గురువారం బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు రవికుమార్ ఆధ్వర్యంలో మండల పరిధిలోని దేవరపల్లిలో బీఆర్‌ఎస్ జెండాను ఆవిష్కరించారు. అనంతరం కార్యకర్తలతో ముచ్చటించారు.

క్లుప్తంగా

సీఈఓగా బాధ్యతల స్వీకరణ



మానవపాడు: మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో గురువారం పీఏసీఎస్ సీఈఓగా శ్రీనివాస్‌రెడ్డి బాధ్యతలు స్వీకరించారు. గతంలో విధులు నిర్వహిస్తున్న ప్రభాకర్‌నాయుడు క్యాతూరుకు బదిలీపై వెళ్లారు. ఈ సందర్భంగా పీఏసీఎస్ అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి తదితరులు అభినందనలు తెలియజేశారు.

గడువు తీరిన మాత్రల పంపిణీ



అయిజ: పట్టణంలోని ఎస్సీ కాలనీకి చెందిన దివ్యాంగురాలు బుధవారం పీహెచ్‌సీకి వెళ్లిన నేపథ్యంలో సిబ్బంది జూలై 2025 ఎక్స్‌పైరీ డేట్ క్యాల్షియం మాత్రలు ఇచ్చారు. అయితే ఇంటికి వెళ్లాక అది గమనించిన కొందరు వ్యక్తులు పీహెచ్‌సీ సిబ్బందితో వాగ్వాదానికి దిగారు. ఇదికాస్తా సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. గురువారం విషయం తెలుసుకున్న డీఎంహెచ్ఓ సిద్ధప్ప విచారణ చేపట్టారు. సిబ్బందిపై తగు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

ఫిజియోథెరపీ క్యాంప్



అయిజ: మండల కేంద్రంలోని ఎమ్మార్సీ భవనంలో గురువారం ఉచిత ఫిజియోథెరపీ క్యాంప్‌ను డాక్టర్ రాంప్రసాద్ నిర్వహించారు. ఎంఈఓ రాములు ఆధ్వర్యంలో 12 మంది చిన్నారులకు ఫిజియోథెరపీ చేశారు. అనంతరం ఇంటివద్ద చేయాల్సిన విధానంపై దివ్యాంగుల తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు.

న్యూట్రీషన్ కిట్ల పంపిణీ



శాంతినగర్: క్యూబ్ రూట్ హైవే ఫౌండేషన్ ఆధ్వర్యంలో టీబీ వ్యాధిగ్రస్తులకు న్యూట్రీషన్ కిట్లు పంపిణీ చేశారు. పీహెచ్‌సీ డాక్టర్ లక్ష్మన్న చేతుల మీదుగా ఫౌండేషన్ సభ్యులు 31 మందికి గురువారం కిట్లు అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ.. మందులతో పాటు సరైన పౌష్టికాహారంతో వ్యాధిని తగ్గించవచ్చన్నారు. ఆరు నెలలపాటు క్షయ వ్యాధిగ్రస్తులు తప్పనిసరిగా చికిత్స పొందాలన్నారు. ప్రతినెల న్యూట్రీషన్ కిట్లు ఫౌండేషన్ ద్వారా అందజేయనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రోగ్రాం కోఆర్డినేటర్ సాదిక్, హెల్త్ సూపర్‌వైజర్ స్వర్ణలత, గురుబసయ్య, చంద్రమోహన్ తదితరులు పాల్గొన్నారు.

చికిత్సకు ఆర్థిక సాయమందించాలి



శాంతినగర్: స్థానిక రాఘవేంద్ర పాఠశాల 5వ తరగతి విద్యార్థి చరిత తీవ్ర అనారోగ్యంతో బాధపడుతోందని, ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యం, దాతలు ఆర్థిక సాయమందించాలని ఎంఎస్ఎఫ్, ఎమ్మార్పీఎస్ నాయకులు కోరారు. చరిత వైద్య చికిత్స కోసం రూ.10 లక్షల మేర ఖర్చు అవనున్నట్లు పేర్కొన్నారు. నిరుపేద కుటుంబ కావడంతో దాతలు ఆదుకోవాలని కోరారు. ఈ మేరకు ఆర్థిక సాయం అందించాలని పాఠశాల యాజమాన్యాన్ని గురువారం పలు ప్రజా సంఘాల నాయకులు కోరారు. దాతలు ముందుకు రావాలని పేర్కొన్నారు.

సబ్సిడీపై వ్యవసాయ పరికరాలు

మల్దకల్: మండలంలోని వ్యవసాయ కార్యాలయంలో సబ్సిడీపై వ్యవసాయ పరికరాలు అందుబాటులో ఉన్నట్లు ఏఓ రాజశేఖర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రైతులకు ప్రభుత్వం 50 శాతం సబ్సిడీతో మొత్తం 250 యూనిట్ల పరికరాలు కేటాయించిందన్నారు. 196 బ్యాటరీ స్ప్రేయర్లు, 39 పవర్ స్ప్రేయర్లు, 14 కల్టివేటర్లు, 10 రోటావేటర్లు అందుబాటులో ఉన్నాయన్నారు. చిన్న, సన్నకారు రైతులు పట్టాదారు పాస్‌బుక్కు, ఆధార్ జిరాక్సుతో వ్యవసాయ కార్యాలయంలో సంప్రదించాలని పేర్కొన్నారు.

గురువు చూపిన బాటలో నడవాలి



మాచర్లలో సర్వేపల్లి రాధాకృష్ణన్ విగ్రహాన్ని ఆవిష్కరించిన నాయకులు

గట్టు: విద్యార్థులు గురువులు చూపిన సన్మార్గంలో ముందుకు సాగాలని, అప్పుడే ఉన్నత లక్ష్యాలను చేరుకోగలరని మాజీ జెడ్పీటీసీ బాసు శ్యామల, మాజీ సర్పంచ్‌లు నారాయణరెడ్డి, వరలక్ష్మీ అన్నారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి సందర్భంగా గురువారం మాచర్ల ఉన్నత పాఠశాల ఆవరణలో నూతనంగా ఏర్పాటు చేసిన ఆయన విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్యతోనే అభివృద్ధి సాధ్యమన్నారు. ప్రతి విద్యార్థి ఉన్నత లక్ష్యాన్ని ఏర్పాటు చేసుకుని దాన్ని సాధించే దిశగా ముందుకు సాగాలన్నారు. క్రమ శిక్షణతో చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో హెచ్ఎం వెంకటేశ్వర్లు, ఆదర్శ పాఠశాల చైర్మన్ సాదికాబేగం, కాంగ్రెస్ నాయకులు వెంకటస్వామి, మాజీ ఎంపీటీసీ కృష్ణ, రాముడు, బాసుగోపాల్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు. అదే విధంగా ఆరగిద్ద ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా జరుపుకొన్నారు. హెచ్ఎం చంద్రకాంత్ వదన్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు సద్దాం, హుస్సేన్, నాగమణి, బుడ్డన్న, కృష్ణప్రద, సౌభాగ్యలక్ష్మిని ఘనంగా సన్మానించారు.



ఆరగిద్దలో ఉపాధ్యాయులను సన్మానించిన విద్యార్థులు

ఉపాధ్యాయులకు ఘన సన్మానం

శాంతినగర్: మండలంలోని కొంకల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదోన్నతి పొందిన ఉపాధ్యాయులకు సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జీహెచ్ఎం వెంకటేష్, బయోసైన్స్ టీచర్ గాజుల ఈశ్వరయ్య, ఎస్ఏ బలరాముడు, ఉపాధ్యాయులు విజయభాస్కర్, లక్ష్మీ నారాయణమ్మలను శాలువా, పూలమాలలు వేసి ఘనంగా సత్కరించారు. టీచర్స్ డేను ముందుగా నిర్వహించినట్లు జీహెచ్ఎం అన్వర్ హుల్ హక్ పేర్కొన్నారు.



కొంకలలో ఉపాధ్యాయులను సన్మానిస్తున్న జీహెచ్ఎం అన్వర్‌హుల్ హక్

ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం

ధరూరు: మండలంలోని ఆయా గ్రామాల్లోని పాఠశాలల్లో ఉపాధ్యాయ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఉపాధ్యాయులను సన్మానించారు.

ఎస్సీ కాలనీలో సమస్యలు పరిష్కరించాలి



ఎంపీడీఓకు వినతిపత్రం అందజేస్తున్న కేవీపీఎస్ నాయకులు

రాజోళి: కొత్త రాజోళిలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని కేవీపీఎస్ నాయకులు ఎంపీడీఓ ప్రవీణ్‌రెడ్డికి గురువారం వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కొత్త రాజోళిలోని ఎస్సీ కాలనీలో వర్షాల కారణంగా రోడ్లు పూర్తిగా దెబ్బతిని నడవడానికి ప్రజలు అవస్థలు పడుతున్నట్లు తెలిపారు. రోడ్లపై వర్షపు నీరు నిలిచి దోమలు వ్యాప్తి చెందుతున్నాయన్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలుతున్న నేపథ్యంలో దోమల నివారణకు కనీసం ఫాగింగ్ కూడా చేయడం లేదన్నారు. అధికారులు కాలనీలో పర్యటించి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో సుందర్‌రాజు, నడిపి దేవరాజు, శ్యామ్, సుధాకర్ తదిదరులు పాల్గొన్నారు.

వ్యాధి నిర్ధారణతో ముప్పును అరికట్టవచ్చు



క్షయవ్యాధి అవగాహన కార్యక్రమంలో వైద్య సిబ్బంది

రాజోళి: క్షయవ్యాధి నిర్ధారణతో ప్రాణాలకు వాటిల్లే ముప్పును అరికట్టవచ్చని మెడికల్ అధికారి డాక్టర్ మధుబాబు అన్నారు. మండల కేంద్రం రైతువేదిక వద్ద గురువారం క్షయవ్యాధిపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దగ్గు, జ్వరం తగ్గకుండా అలాగే ఉండటం, ఇతర అనారోగ్య లక్షణాలు ఉన్నవారు వెంటనే ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సంప్రదించాలన్నారు. ముఖ్యంగా క్షయ బారిన పడిన వారు మందులు తీసుకోవడం ద్వారా ఆదిలోనే అరికట్టవచ్చని సూచించారు. పౌష్టికాహారం, వైద్యుల సలహాల మేరకు మందులు వాడాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో టీబీ కోఆర్డినేటర్ సాదిక్, ఎంపీహెచ్ఓ రామకృష్ణ, హెలేన్, గురుబసయ్య, వెంకటేష్, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉండ్రాలయ్యా.. వెళ్లి రావయ్యా



అయిజలో పూజలు చేస్తున్న ఎస్ఐ శ్రీనివాసరావు



వడ్డేపల్లిలో లడ్డును ఊరేగిస్తున్న భక్తులు

శాంతినగర్/అయిజ/మానవపాడు: గణపతి నవరాత్రుల్లో భాగంగా ప్రతిష్ఠించిన గణనాథుల నిమజ్జన కార్యక్రమంలో వైభవంగా నిర్వహించారు. వడ్డేపల్లి మున్సిపాలిటీ, మండల పరిధిలోని ఆయా గ్రామాల్లోని గణనాథులను గురువారం నిమజ్జనానికి తరలించారు. ప్రత్యేక పూజలు, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం లడ్డు, వస్త్రాలు, పండ్లు, చెరుకుగెడలు వేలం వేశారు. వడ్డేపల్లిలోని శివాలయంలో ప్రతిష్ఠించిన గణపతి లడ్డు శివహనుమాన్ యూత్ సభ్యులు రూ.50,116కు వేలంలో కైవసం చేసుకున్నారు. అనంతరం భాజాభజంత్రీలు, డప్పులు, బాణసంచాల మధ్య గణనాథులను ఊరేగించారు. రాజోళి సమీపంలోని సుంకేసుల బ్యారేజీ వద్దకు, మరికొందరు బీచుపల్లి కృష్ణానదిలో నిమజ్జనం చేశారు.

- అయిజ మండల కేంద్రంలోని గుంతరామలింగేశ్వర స్వామి ఆలయం వద్ద ప్రతిష్ఠించిన గణేష్ విగ్రహ నిమజ్జన కార్యక్రమం బుధవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. గురువారం పట్టణంలోని తెలుగుపేటలో ఎస్ఐ శ్రీనివాసరావు, కాంగ్రెస్ నాయకులు షేక్షావలి ఆచారి ప్రత్యేక పూజలు చేశారు.
- మానవపాడు మండలంలోని ఆయా గ్రామాల్లో వినాయక నిమజ్జనం కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. యువకులు, భక్తులు నృత్యాలు, కోలాటలతో ఉత్సాహంగా చేశారు. మండల కేంద్రంలోని పంచాయతీ కార్యాలయంలో అన్నదానం చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ నరసింహులు, వెంకటేష్, మధు భక్తులు పాల్గొన్నారు.



మానవపాడులో అన్నదానం నిర్వహిస్తున్న భక్తులు



అయిజలో నిమజ్జనానికి తరలివెళ్తున్న గణనాథుడు



వడ్డేపల్లిలో శోభాయాత్రలో పాల్గొన్న భక్తులు